సాక్షి
వైఎస్సార్ జిల్లా

ఆదివారం । 7 । సెప్టెంబర్ । 2025



'కృషి'కి దక్కిన ఫలితం

కృషి విజ్ఞాన కేంద్రాల వార్షిక కార్యాచరణలో.. కడప ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రానికి జోనల్ స్థాయిలో నాలుగు పురస్కారాలు లభించాయి.

-8లో



ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్‌లో వైవీయూకు ఉన్నత స్థానం

ఎన్ఐఆర్ఎఫ్‌లో వైవీయూకి 51 నుంచి 100 లోపు ర్యాంకు లభించిందని ఉపకులపతి అల్లం శ్రీనివాసరావు వెల్లడించారు.

-8లో

గరిష్టం/కనిష్టం
36.4/24.7

వాతావరణం

జిల్లాలో శనివారం 24.7 - 36.4 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 2.6 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

ఎల్ఎల్‌బీ ఫలితాల విడుదల

కడప ఎడ్యుకేషన్: యోగివేమన విశ్వవిద్యాలయం ఎల్ఎల్‌బీ (మూడేళ్ల, ఐదేళ్ల) మొదటి సెమిస్టర్ పరీక్ష ఫలితాలను విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య అల్లం శ్రీనివాసరావు శనివారం సాయంత్రం తన చాంబర్‌లో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్ఎల్‌బీ (ఐదేళ్ల) మొదటి సెమిస్టర్ పరీక్షల్లో 50.42 శాతం మంది, ఎల్ఎల్‌బీ (మూడేళ్ల) మొదటి సెమిస్టర్ ఫలితాల్లో 17.63 శాతం మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ పి.పద్మ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ టీఎస్‌వీ కృష్ణారావు పాల్గొన్నారు.

నేడు ఒంటిమిట్ట రామాలయం మూసివేత

ఒంటిమిట్ట: ఒంటిమిట్ట శ్రీ కోదండ రామాలయాన్ని చంద్రగ్రహణం కారణంగా ఆదివారం మూసివేయనున్నట్లు టీటీడీ ఆలయ ఇన్‌స్పెక్టర్ నవీన్ కుమార్ శనివారం తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం వరకు స్వామివారి దర్శనం ఉంటుందని తెలిపారు. మధ్యాహ్నం 1:50 గంటలకు ఆలయాన్ని మూసివేస్తామని, తిరిగి 8వ తేదీ తెల్లవారుజామున ఆలయ శుద్ధి, సంప్రోక్షణ చేసి యథావిధిగా భక్తులను ఆలయంలోకి అనుమతిస్తామని పేర్కొన్నారు. అయితే ఆదివారం జరిగే పౌర్ణమి కల్యాణాన్ని ఎప్పటిలాగే ఉదయం 9:30 నుంచి నిర్వహిస్తామన్నారు. ఈ విషయాన్ని భక్తులు గమనించాలని కోరారు.

గండి అంజన్నకు భారీ ఆదాయం

వేంపల్లె: మండలంలోని గండి వీరాంజనేయ స్వామి ఆలయానికి శనివారం ఒక్క రోజే భారీగా రూ.4.03 లక్షల ఆదాయం వచ్చినట్టు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వెంకట సుబ్బయ్య తెలిపారు. స్వామి వారిని దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో భక్తులు రావడం వల్ల ఈ ఆదాయం వచ్చిందని ఆయన పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం 4 గంటలకు చంద్రగ్రహణం కారణంగా స్వామివారి ఆలయం మూసి వేయనున్నట్లు పేర్కొన్నారు. తిరిగి సోమవారం తెల్లవారుజామున 5 గంటలకు సంప్రోక్షణ చేసి ఆలయాన్ని తెరిచి శుద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వివరించారు.

వేగంగా స్మార్ట్ కిచెన్ పనులు

కడప సెవెన్‌రోడ్స్: మండలాల స్మార్ట్ కిచెన్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి తెలిపారు. శనివారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లాలోని మండలాల్లో స్మార్ట్ కిచెన్‌ల నిర్మాణాల అంచనాలు, టెండర్లు, మెటీరియల్ సంబంధిత అంశాలపై వివిధ శాఖల జిల్లా అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వీసీ ద్వారా నియోజకవర్గ, మండల ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆగ్రోస్ డీఎం జోయల్ విజయ్ కుమార్, డీఆర్డీఏ పీడీ రాజ్యలక్ష్మి, డీఈఓ షంషుద్దీన్, డ్వామా పీడీ ఆదిశేషారెడ్డి, సీపీఓ హజరతయ్య, పంచాయతీ రాజ్ ఎస్ఈ మద్దన్న తదితరులు పాల్గొన్నారు.

'అందుబాటులో ఎరువులు'

కడప అగ్రికల్చర్: జిల్లాలో ఖరీఫ్‌నకు సంబంధించి 69653 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరమని, కాగా ఇప్పటి వరకు 23885.07 మెట్రిక్ టన్నుల ఎరువులు సరఫరా చేసినట్లు జిల్లా వ్యవసాయ అధికారి చంద్రనాయక్ తెలిపారు. ఇంకా జిల్లాలో 23374.6 మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ఇందులో యూరియా 1796.21 మెట్రిక్ టన్నులు, 3688.7 మెట్రిక్ టన్నుల డీఏపీ, 13982.68 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్ ఎరువులు, 1964.2 మెట్రిక్ టన్నుల ఎంఓపీ, 1942.79 మెట్రిక్ టన్నుల ఎస్ఎస్‌పీ ఉన్నాయన్నారు. బఫర్‌గా 450 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉన్నందున, అందులో 370 మెట్రిక్ టన్నులు శనివారం రైతు సేవా కేంద్రాలకు సరఫరా చేసినట్లు చెప్పారు. మళ్లీ 7వ తేదీ ఆదివారం జిల్లాకు 996 మెట్రిక్ టన్నుల యూరియా రాబోతుందని తెలిపారు. రైతులెవరూ ఆందోళన చెందవద్దని సూచించారు.

సైబర్ నేరాలు అరికట్టడంపై అవగాహన



మాట్లాడుతున్న ఏపీజీబీ మేనేజర్ శైలజ

చాపాడు: ఆర్థిక సైబర్ నేరాలు అరికట్టడంపై అవగాహన పెంచుకోవాలని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ మేనేజర్ శైలజ పేర్కొన్నారు. మండలంలోని చిన్న గురువలూరు జెడ్పీ హైస్కూల్‌లో శనివారం హెల్త్ ఎడ్యుకేషన్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ రిజర్వ్ బ్యాంక్ ఆధ్వర్యంలో డిపాజిటర్స్ ఎడ్యుకేషన్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎవరైనా తమ ఖాతాల్లో డబ్బు మాయమైతే వెంటనే 1930 టోల్ ఫ్రీ నంబర్‌ను సంప్రదించాలన్నారు. రాటా సంస్థ కళాబృందం జానపద గీతాలు, ఇంద్రజాల ప్రదర్శనలతో అవగాహన కల్పించింది. ఈ కార్యక్రమంలో హెడ్స్ సంస్థ అధ్యక్షుడు కృష్ణయ్య యాదవ్, హైస్కూల్ హెచ్ఎం రజిని తదితరులు పాల్గొన్నారు.

నాటకం.. బూటకం

- ఎర్రబల్లి చెరువుకు నీటి తరలింపుపై సర్కారు కొత్త పల్లవి
- వైఎస్ కుటుంబానికి పేరు వస్తుందనే కక్ష
- సీబీఆర్ నుంచి విడుదలకు వైఎస్ఆర్ హయాంలోనే ప్రణాళిక
- వైఎస్సార్‌సీపీ పాలనలో రూ.1100 కోట్ల మంజూరు
- హెచ్ఎన్ఎస్ఎస్ నుంచి అందిస్తామని కూటమి ప్రగల్భాలు
- రైతులను మభ్యపెట్టే ప్రయత్నం



ఎర్రబల్లి చెరువు వ్యూ



కడప సిటీ: చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్(సీబీఆర్) నుంచి ఎర్రబల్లి చెరువుకు రోజుకు 16 క్యూసెక్కుల నీటిని తరలించే ప్రక్రియ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలోనే రూపుదిద్దుకుంది. చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (శ్రీ పెంచికల బసిరెడ్డి) పులివెందుల నియోజకవర్గం లింగాల మండలం పార్నపల్లి గ్రామ సమీపంలో చిత్రావతి నదికి అడ్డంగా ఉంది. పులివెందుల మండలంలో ఎర్రబల్లి చెరువు ఉంది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చాక ఎర్రబల్లి చెరుకు రోజుకు 100 క్యూసెక్కుల నీటిని అందించేందుకు ప్రణాళిక సిద్ధం చేయడమే కాకుండా రూ.1100 కోట్ల నిధులు కేటాయించారు. చిత్రావతి నుంచి పైపులైన్ ద్వారా ఎర్రబల్లి చెరువుకు తరలించేందుకు చర్యలు తీసుకున్నారు. ఆ ప్రభుత్వంలో ఇందుకు సంబంధించి పంపుహౌస్ కూడా దాదాపు పూర్తి కావచ్చింది. ఈ పనులను కొనసాగించకుండా టీడీపీ ప్రభుత్వం కొత్త నాటకాన్ని తెరపైకి తెచ్చి రైతులను మభ్యపెట్టేందుకు.. సాధ్యం కాని ఓ పథకాన్ని తీసుకొచ్చే ప్రయత్నాలు మొదలు పెట్టింది. హెచ్ఎన్ఎస్ఎస్ నుంచి ఈ చెరువుకు నీటిని దాదాపు రోజుకు 30 క్యూసెక్కులు తరలించినా రెండు నెలల కాలం పడుతుంది. అదే చిత్రావతి నుంచి అయితే కేవలం పది రోజులు మాత్రమే ఎర్రబల్లి చెరువును నింపేందుకు అవకాశాలు ఉన్నాయి. ఈ పనులను చేస్తే మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మంచి పేరు వస్తుందన్న ఉద్దేశంతో హెచ్ఎన్ఎస్ఎస్ నుంచి నీటి తరలింపు కష్టమైన పని అయినప్పటికీ రూటు మార్చి మరో పథకానికి కూటమి ప్రభుత్వం తెర లేపింది. ఈ పథకం వల్ల రైతులకు ఎటువంటి ప్రయోజనం కలిగే అవకాశం లేదు.

సీబీఆర్ నుంచి రోజుకు 100 క్యూసెక్కుల నీరు

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎర్రబల్లి చెరువును నింపేందుకు చిత్రావతి రిజర్వాయర్ నుంచి పంపుహౌస్ ద్వారా పైపులైన్ ఏర్పాటు చేసి రోజుకు 100 క్యూసెక్కుల నీటిని తరలించేలా చర్యలు చేపట్టారు. ఈ పనుల కోసం రూ.1100 కోట్ల నిధులు కేటాయించారు. మొత్తం ఈ పనులకే కాకుండా వేంపల్లె మండలం గిడ్డంగివారిపల్లె ఆనకట్టకు నీటిని అందించేందుకు చర్యలు తీసుకున్నారు. ప్రస్తుతం ఎర్రబల్లి చెరువుకు నీటిని తరలించేందుకు గత ప్రభుత్వంలోనే పంపుహౌస్ నిర్మాణ పనులు చేపట్టారు. చిత్రావతి నుంచి ఈ పైపులైన్ ఏర్పాటు చేస్తే రోజుకు 100 క్యూసెక్కుల నీటిని తరలిస్తే.. కేవలం 10 రోజుల్లోనే ఆ చెరువు నిండుకుండలా తయారవుతుంది. చిత్రావతిలో గండికోట ప్రాజెక్టు నుంచి నీళ్ల వెళ్లడం ద్వారా ఎప్పటికీ ప్రాజెక్టులో నీళ్ల ఉండే అవకాశం ఉంది. పది టీఎంసీల కెపాసిటీ గల చిత్రావతి ప్రాజెక్టు నుంచి ఈ చెరువుకు నీళ్ల అందించేందుకు ఎటువంటి ఢోకా లేదు. ఈ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ ద్వారా 350 క్యూసెక్కుల నీటిని ఎర్రబల్లి ట్యాంకుతోపాటు కొత్తగా ఏర్పడిన గిడ్డంగివారిపల్లె రిజర్వాయర్ కూడా 2022లోనే పనులు ప్రారంభించారు. ట్యాంకు సామర్థ్యం 87 ఎంసీఎఫ్‌టీ, ఈ లిఫ్ట్ స్కీమ్ ద్వారా ఎర్రబల్లి ట్యాంకుకు కేటాయించిన నీరు 100 క్యూసెక్కుల నీరు అందుతుంది. ఈ పనులు పూర్తయితే ఆ చెరువు చుట్టుపక్కల ఉన్న గ్రామాల్లో రీఛార్జి ద్వారా 4 వేల ఎకరాల పరోక్ష ఆయకట్టుకు ప్రయోజనం చేకూరుతుంది.

సీబీఆర్ ద్వారా త్వరగా..

ఎర్రబల్లి చెరువు నింపడానికి సీబీఆర్ జలాశయం నుంచి ఎంఎస్ పైపులైన్ ద్వారా నీటిని ఎత్తివేయడం శాశ్వత పరిష్కారంగా ఉంటుంది. తద్వారా 400 ఎకరాల పరోక్ష ఆయకట్టుకు ఉపయోగపడుతుంది. దీని ద్వారా మనం ఏ అంతర్ జిల్లాల అనుమతులు లేకుండా అందుబాటులో ఉన్న ఏ సీజన్‌లోనైనా ఎర్రబల్లి ట్యాంకుకు నీటిని నింపవచ్చు. రిజర్వాయర్ నుంచి ఎర్రబల్లి ట్యాంకు వరకు ఎంఎస్ పైపులైన్ పొడవు కేవలం 28 కిలోమీటర్లు చేపట్టాల్సి ఉంటుంది. అయితే ఇప్పటికే నాలుగు కిలోమీటర్ల పైపులైన్ పని పూర్తయింది. మిగిలిన పని పూర్తయిన తర్వాత నీటిని ఎర్రబల్లి ట్యాంకుకు అతి సులభంగా ఎత్తి పోయవచ్చు. 2022లో ప్రారంభించడానికి ఈ లిఫ్ట్ పథకం మాత్రమే తక్కువ సమయంలో ట్యాంకును నింపగలదు. కరువు పరిస్థితులు ఉన్నప్పుడల్లా ఉద్యానవన పంటలను రక్షించుకునే అవకాశాలు మెండుగా ఉన్నాయి. అదే హెచ్ఎన్ఎస్ఎస్ నుంచి నీటిని తరలించాలంటే అనంతపురం, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల నుంచి అనుమతులు కోరాల్సి ఉంటుంది.

హెచ్ఎన్ఎస్ఎస్ నుంచి నీళ్లు వచ్చే అవకాశం తక్కువ



చిత్రావతి నుంచి ఎర్రబల్లి చెరువుకు ప్రస్తుత పనులు పూర్తి చేస్తే కేవలం పది రోజుల్లోనే నీళ్లు అందుతాయి. కూటమి ప్రభుత్వం హెచ్ఎన్ఎస్ఎస్ నుంచి ఎర్రబల్లి చెరువుకు నీరు తరలించాలంటే అవకాశాలు తక్కువగా ఉన్నాయి. రెండు నెలల సమయం పడుతుంది. అసలు ఈ పథకమే అవసరం లేదు. -విష్ణు, రైతు, నల్లపురెడ్డిపల్లె

మభ్యపెట్టేందుకే...



చిత్రావతి నుంచి ఎర్రబల్లి చెరువుకు సులభంగా నీరు అందించే అవకాశం ఉంది. వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం అందుకు సంబంధించిన పనులను కూడా చేపట్టింది. కేవలం రైతులను మభ్యపెట్టేందుకే కూటమి ప్రభుత్వం హెచ్ఎన్ఎస్ఎస్ నుంచి నీటిని అందిస్తామని చెబుతోంది. ఇది అసాధ్యం. - దిష్ వెంకటరెడ్డి, రైతు, నల్లపురెడ్డిపల్లె

వైఎస్ జగన్‌కు పేరు వస్తుందనే ఉద్దేశంతోనే..

ప్రస్తుతం చిత్రావతి ప్రాజెక్టు వద్ద ఏర్పాటు చేసిన పంపుహౌస్ పనులను చేపట్టి పైపులైన్ ద్వారా ఎర్రబల్లి చెరువుకు నీటిని అందించేందుకు కూటమి ప్రభుత్వం ఎక్కడ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మంచి పేరు వస్తుందన్న ఉద్దేశంతో కొత్త నాటకానికి తెర లేపారు. ఆయన హయాంలో ప్రారంభించిన పనులు చేస్తే వైఎస్ జగన్‌కు క్రెడిట్ దక్కుతుందని ఈ పనులను పక్కనపెట్టి రైతులను మభ్యపెట్టేందుకు హెచ్ఎన్ఎస్ఎస్ ద్వారా ఎర్రబల్లి చెరువుకు నీరందిస్తామని కూటమి ప్రభుత్వం చెబుతోంది. అయితే ప్రస్తుతం హెచ్ఎన్ఎస్ఎస్‌కు శ్రీశైలం జలాశయం నుంచి అనంతపురం జిల్లా జీడిపల్లి, ఇతర జలాశయాలకు నీటిని సరఫరా చేస్తూ కొత్తగా నిర్మించిన ఓటీ స్లూయిజ్‌కు నీళ్ల చేరుకోవడానికి 421 కి.మీ. ప్రయాణించాల్సి ఉంటుంది. ప్రధానంగా కదిరి నియోజకవర్గంలోని 421 కి.మీ. వద్ద హెచ్ఎన్ఎస్ఎస్ ప్రధాన కాలువపై ఇటీవల నిర్మించిన వాటర్ స్లూయిజ్ ఎర్రబల్లి ట్యాంకుకు దారి తీసే వాగుకు 30 క్యూసెక్కుల నీటిని అందించేందుకు కూటమి ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. ఈ ప్రవాహం వల్ల ఎర్రబల్లి చెరువుకు చేరుకునేందుకు ముందు 14 కి.మీ. మేర నీరు ప్రయాణించాలి. అంతేకాకుండా ఆ నీళ్లు ట్యాంకుకు చేరుకునేందుకు ముందు చాలా ఇన్ఫిల్ట్రేషన్ నష్టాలను కలిగిస్తుంది. ఈ నష్టాల తర్వాత ఎర్రబల్లి చెరువుకు నికర నీటి విడుదల దాదాపు 20 క్యూసెక్కులు మాత్రమే ఉంటుంది. ఈ ట్యాంకు పర్కులేషన్ ట్యాంకు కాబట్టి పర్కులేషన్ నష్టాలు తగ్గించిన తర్వాత కనీసం 100 రోజులపాటు హెచ్ఎన్ఎస్ఎస్ ప్రధాన కాలువ నుంచి నీటిని విడుదల చేయాల్సి ఉంటుంది. అప్పుడే ఎర్రబల్లి చెరువును పూర్తిగా నింపే అవకాశం ఉంటుంది. అయితే శ్రీశైలం జలాశయం నుంచి నీటిని విడుదల చేసిన తర్వాత నీళ్లు 421 కి.మీ. చేనేజ్‌ను చేరుకునేందుకు కనీసం రెండు మాసాలు పడుతుంది. హెచ్ఎన్ఎస్ఎస్ ప్రధాన కాలువకే నీళ్లు వచ్చే పరిస్థితి చాలా తక్కువగా ఉంటుంది.

'సంపూర్ణత అభియాన్' సారథులకు సత్కారం



డీఈఓకు ప్రశంసా పత్రం అందజేస్తున్న కలెక్టర్ శ్రీధర్

కడప ఎడ్యుకేషన్: జిల్లాలో సంపూర్ణత అభియాన్ అభివృద్ధి లక్ష్య సాధనకు కృషి చేసిన అధికారులను శనివారం ఘనంగా సత్కరించారు. ఆకాంక్ష జిల్లా, ఆకాంక్ష బ్లాకుల్లో ఆరు విభాగాల్లో లక్ష్యాలు సాధించిన నేపథ్యంలో సంబంధిత భాగస్వామ్య శాఖల అధికారులు, ఫ్రెంట్‌లైన్ అధికారులు, సిబ్బందిని అభినందిస్తూ కడప మాధవి కన్వెన్షన్ హాలులో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరితోపాటు కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్య హాజరయ్యారు. ముందుగా ఆకాంక్ష జిల్లా, బ్లాకుల లక్ష్య సాధనకు చేపట్టిన కార్యక్రమాలకు సంబంధించి ఆయా శాఖలు ప్రదర్శించిన స్టాళ్లను పరిశీలించారు. అనంతరం ఏర్పాటైన సభలో జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యేలు ఏడీపీ భాగస్వామ్య శాఖల అధికారులు, ఫ్రెంట్‌లైన్ అధికారులు, సిబ్బందికి పతకాలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వైఎస్ఆర్ కడప ఆకాంక్ష జిల్లాలో ఎంపికైన చింతకొమ్మదిన్నె, జమ్మలమడుగు ఆకాంక్ష బ్లాక్‌లలో నీతి ఆయోగ్ గుర్తించిన 6 అంశాల్లో 'సంపూర్ణత అభియాన్' కార్యక్రమాన్ని సంబంధిత శాఖలైన వైద్య ఆరోగ్య, శిశు సంక్షేమం, గ్రామీణాభివృద్ధి, విద్య, నైపుణ్యాభివృద్ధి, వ్యవసాయ, పట్టణాభివృద్ధి మొదలైన శాఖల ఆధ్వర్యంలో ప్రారంభించినట్లు తెలిపారు. ప్రభుత్వం గుర్తించిన ఆరు ముఖ్యమైన సూచికల్లో (జీవన ప్రమాణాలు మెరుగు పరచుటలో) సంబంధించి సంతృప్తికర స్థాయిని పొందడమే సంపూర్ణత అభియాన్ ముఖ్య ఉద్దేశం అన్నారు. 2024 ఫిబ్రవరి నాటికి ఆకాంక్ష జిల్లా, బ్లాకుల్లో వైద్య ఆరోగ్య రంగంలో ప్రెగ్నెంట్ ఉమెన్ సమస్యలు, ఐసీడీఎస్‌లో బాలింత తల్లుల పోషకాహార సమస్యలు, విద్య శాఖలో మౌలిక సదుపాయలు, వ్యవసాయంలో సాయిల్ హెల్త్ కార్డులు పంపిణీ, గ్రామీణాభివృద్ధి రంగాలు, ఏపీ గ్రూపులకు బ్యాంకు రుణాలు అందజేయడం.. వంటి ఆరు అంశాల్లో జిల్లాను అభివృద్ధి పథంలోకి తీసుకుని వచ్చి సంపూర్ణత అభియాన్ అభివృద్ధి లక్ష్యాన్ని వంద శాతం సంతృప్తికర స్థాయిలో సాధించినందుకు గాను నీతి ఆయోగ్ మన జిల్లాకు మొదటి ర్యాంకును ప్రకటించడం జరిగిందన్నారు. ఆరు ప్రామాణికాల్లో అభివృద్ధిని ఆకాంక్షిస్తూ.. 2018 నుంచి ఇప్పటి వరకు పూర్తి స్థాయి అభివృద్ధిని సాధించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి హజరతయ్య, డీఎంహెచ్ఓ శ్రీ నాగరాజు, ఐసీడీఎస్ పీడీ రమాదేవి, డీఈవో షంషుద్దీన్, డీఏవో చంద్రానాయక్, డీఆర్డీఏ పీడీ రాజ్యలక్ష్మి, ఎల్డీఎం జనార్దనం, అనుబంధ శాఖల జిల్లా అధికారులు, నీతి ఆయోగ్ యంగ్ ప్రొఫెషనల్స్ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలు పకడ్బందీగా నిర్వహించాలి

- కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప సెవెన్‌రోడ్స్: జిల్లాలో ఉల్లి పండించిన రైతుల నుంచి క్వింటా రూ.1200కు మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయు ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి తెలిపారు. శనివారం జిల్లా కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాలో జరుగుతున్న ఉల్లి కొనుగోలు ప్రక్రియపై జిల్లా జాయింట్ కలెక్టరు అదితిసింగ్, వ్యవసాయ, మార్క్‌ఫెడ్ సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించి మాట్లాడారు. జిల్లాలో రెండు కొనుగోలు కేంద్రాలు వ్యవసాయ మార్కెట్ కమిటీ(ఏఎంసీ) కమలాపురం, మైదుకూరులో ఏర్పాటు చేసి, ఈ నెల 4 నుంచి ప్రారంభించినట్లు పేర్కొన్నారు. రైతులు తమ ఉల్లిపంటను ఆరబెట్టి గ్రేడింగ్, శుభ్రం చేసుకొని యార్డుకు తీసికొని వచ్చేలా, కేవలం ఈ-క్రాప్‌లో నమోదు చేసుకున్న వారు మాత్రమే తమ పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డుతోపాటు రైతు సేవా కేంద్ర సిబ్బంది ఇచ్చు ఉల్లి పంట నమోదు సర్టిఫికెట్ జిరాక్స్ కాపీలు మార్కెట్ యార్డుకు వచ్చు సమయంలో తీసుకుని వచ్చేలా అవగాహన కల్పించాలన్నారు. ఉల్లి రైతులకు సమాచార నిమిత్తం కంట్రోల్ రూమ్- 7095621491, ఏపీ మార్క్‌ఫెడ్ జిల్లా అధికాణి పరిమళ జ్యోతిని సంప్రదించవచ్చునని వివరించారు.

ఉల్లి ధర పతనంపై ఆందోళన



కలెక్టరేట్ ఎదుట ఉల్లిగడ్డలు తగలబెట్టి నిరసన వ్యక్తం చేస్తున్న రైతు సంఘం నాయకులు

- మద్దతు రేటు రూ.3 వేలు కల్పించాలని డిమాండ్
- కలెక్టరేట్ వద్ద ఉల్లిగడ్డలు తగలబెట్టి రైతు సంఘం నిరసన

కడప సెవెన్‌రోడ్స్: ఉల్లి ధరలు భారీగా పడిపోవడంపై ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. కడపలోని కలెక్టరేట్ వద్ద శనివారం ఉల్లిగడ్డలపై పెట్రోల్ పోసి తగలబెట్టి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర మాట్లాడుతూ ఉల్లిగడ్డలు మార్కెట్‌లో క్వింటా వెయ్యి రూపాయలకు కూడా కొనడం లేదన్నారు. ప్రభుత్వం రూ.1200 ప్రకటించి కొనుగోలు చేస్తామంటోందని, ఈ రేటుకు అమ్మితే కనీసం పెట్టుబడులు కూడా దక్కవన్నారు. ఉల్లి ఎకరం సాగు చేయడానికి రూ. 80 వేల దాకా ఖర్చు అవుతుందని తెలిపారు. రైతుల వ్యవసాయ ఉత్పత్తులు, వినియోగదారుల మధ్య ధరల వ్యత్యాసం తగ్గించేందుకు, చీకటి మార్కెట్ల నివారణకు ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ ఆచరణలో సాధ్యం కావడం లేదన్నారు. కనీస మద్దతు ధర మూడు వేల రూపాయలు కల్పించి ప్రభుత్వమే కొనుగోలు చేసే వరకు పోరాటం చేస్తామని పేర్కొన్నారు. అనంతరం కలెక్టరేట్ ఏవో విజయ్‌కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎంవీ సుబ్బారెడ్డి, పి.భాస్కర్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎల్.నాగ సుబ్బారెడ్డి, ఎస్.వెంకట శివ, కేసీ బాదుల్లా, సురేష్, జి.మద్దిలేటి, వెంకట్ రాముడు, శంకర్ నాయక్, భవాని శంకర్, నాగేశ్వరరావు, మల్లికార్జున, భాగ్యలక్ష్మి, మునయ్య, రామ్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అన్నదాత సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యం

- పంటలకు దక్కని గిట్టుబాటు ధర
- యూరియా సరఫరాలో విఫలం
- 9న వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో రైతు పోరు
- మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా



రైతు పోరు పోస్టర్లు ఆవిష్కరిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, నాయకులు

కడప కార్పొరేషన్: అన్నదాత సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా విమర్శించారు. ఎన్నికల వేళ కూటమి ఎన్నో హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత వెన్నుపోటు పొడిచిందని ధ్వజమెత్తారు. శనివారం తన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. పంటలకు గిట్టుబాటు ధర లేదని, పంట నష్టపోతే ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వడం లేదన్నారు. ఈ క్రాప్ నమోదు చేసిన రైతులకు పంటల భీమా ప్రీమియం కూడా ప్రభుత్వం చెల్లించడం లేదన్నారు. వ్యవసాయం దండగ అన్న చంద్రబాబు, నేడు దాన్ని నిరూపిస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి, వ్యవసాయ శాఖామంత్రి వ్యవసాయాన్ని అవహేళన చేసేలా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. యూరియా కోసం రైతులు క్యూ లైన్లలో నిల్చుంటే వ్యవసాయ శాఖ మంత్రి, రైతులు బఫే భోజనం కోసం నిల్చున్నట్లు ఉన్నారని ఎద్దేవా చేయడం దుర్మార్గమన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక అల్లాడుతున్నారన్నారు. యూరియా అందుబాటులో ఉందని చెబుతూనే, యూరియా వల్ల కేన్సర్ వస్తుందని ముఖ్యమంత్రి చెప్పడం దారుణమన్నారు. వరి రైతులను నిరుత్సాహపరిచేలా, వ్యవసాయాన్ని నిర్లక్ష్యం చేసేలా సీఎం వ్యాఖ్యలు ఉన్నాయన్నారు. మార్క్‌ఫెడ్‌ల ద్వారా యూరియా సరఫరా చేయాల్సిన ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా నాణ్యమైన ఎరువులు, విత్తనాలు సరఫరా చేయాల్సిన ప్రభుత్వం, ఆర్‌బీకేలను నిర్వీర్యం చేసిందన్నారు. కడపలోని ఆలంఖాన్‌పల్లె సొసైటీకి 50 ఏళ్ల చరిత్ర ఉందని, అలాంటి సొసైటీకి ఒక్క యూరియా బస్తా కూడా ఇవ్వకపోవడం దుర్మార్గమన్నారు. యూరియాపై కృత్రిమ కొరత సృష్టించడం వల్ల రూ.270కి అమ్మాల్సిన దాన్ని రూ.600లకు విక్రయిస్తున్న పరిస్థితి ఉందన్నారు. యూరియా సరఫరాలో రూ.300 కోట్ల స్కాం జరిగిందని ఆరోపించారు.

ధరల స్థిరీకరణ నిధి ఏదీ?

రాష్ట్రంలో గతం కంటే తక్కువ సాగు విస్తీర్ణం నమోదైనప్పటికీ.. సక్రమంగా విత్తనాలు, ఎరువులు సరఫరా చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. గతంలో పుట్టి వడ్లు రూ.16 వేలు ఉండగా, ఇప్పుడు రూ.12 వేలు మాత్రమే ఉందన్నారు. చీనీ టన్ను గతంలో లక్ష రూపాయలు ఉండగా, ఇప్పుడు రూ.15 వేలే ఉందన్నారు. ఉల్లికి ప్రభుత్వం రూ.1200 మద్దతు ధర ఇవ్వడం దారుణమన్నారు. కనీసం క్వింటా రూ.3 వేలతో కొనాలని డిమాండ్ చేశారు. రైతుల కోసం రూ.5 వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేసి రైతులను ఆదుకుంటామని చెప్పిన ప్రభుత్వం ఆ నిధే ఏర్పాటు చేయలేదన్నారు. ఈ క్రాప్ నమోదు చేసిన రైతులకు ప్రభుత్వమే ప్రీమియం చెల్లించి భీమా కల్పించాలన్నారు. ఈ సమస్యల పరిష్కారానికి వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో 'రైతు పోరు' నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 9వ తేది ఉదయం 10 గంటలకు జిల్లా పార్టీ కార్యాలయం నుంచి ఆర్‌డీఓ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించి, ఆర్‌డీఓకు వినతి పత్రం సమర్పించనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. అనంతరం రైతు పోరు పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు సంబటూరు ప్రసాద్‌రెడ్డి, పార్టీ నాయకులు యానాదయ్య, దాసరి శివప్రసాద్, బంగారు నాగయ్య యాదవ్, దేవిరెడ్డి ఆదిత్య, సీహెచ్ వినోద్ కుమార్, షంషీర్, చెన్నయ్య, ఆర్‌వీ రమణ తదితరులు పాల్గొన్నారు.

ఫారెస్ట్ సర్వీస్ పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు

కడప సెవెన్‌రోడ్స్: ఈ నెల 7న జరగనున్న ఏపీ ఫారెస్ట్ సబ్ ఆర్డినేట్ సర్వీసెస్‌కు సంబంధించి ఫారెస్ట్ బీట్ ఆఫీసర్, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ స్క్రీనింగ్ పరీక్షలు పటిష్టంగా నిర్వహించాలని పరిపాలన అధికారి కె.విజయకుమార్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(ఏపీపీఎస్సీ) ఆధ్వర్యంలో నిర్వహించే ఈ పరీక్షల నిర్వహణపై ఏపీపీఎస్సీ పరీక్షల జిల్లా ప్రత్యేక అధికారులైన పర్యవేక్షకులు యం.అమ్మాజీ, ఏఎం మాధవీలత, సీహెచ్ దీప్తి, సెక్షన్ ఆఫీసర్స్‌తో కలిసి పరీక్షల విధులు కేటాయించిన 17 మంది లైజెన్ ఆఫీసర్లు, 17 మంది చీఫ్ సూపరింటెండెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్ష కేంద్రాలలో ఎలాంటి మాల్ ప్రాక్టీస్ కార్యకలాపాలకు తావు లేకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. పోలీసు శాఖ ప్రతి సెంటర్లో బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. జిల్లాలోని కడప నగర పరిధిలో 9, చింతకొమ్మదిన్నె మండలంలో 4, ప్రొద్దుటూరు మండలంలో 4 పరీక్షా కేంద్రలతో కలిపి మొత్తం 17 కేంద్రాలను ఎంపిక చేయడం జరిగిందన్నారు. అభ్యర్థుల సహాయార్థం కలెక్టర్ కార్యాలయంలో హెల్ప్ డెస్క్ నంబరు 08562-246344 ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీపీఎస్సీ సిబ్బంది, లైజెన్ ఆఫీసర్లు, చీఫ్ సూపరింటెండెంట్లు, లైన్ డిపార్టుమెంట్లు (లేబర్, పోలీస్, మెడికల్, ఏపీఎస్ ఆర్టీసీ, ఏపీఎస్ పీడీసీఎల్) శాఖల అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి



కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగర శివార్లలోని ఫాతిమా కళాశాల సమీపంలోని ఎగువ రైలు పట్టాలపై ఓ వ్యక్తి గూడ్స్ రైలు కిందపడి మృతి చెందినట్లు రైల్వే ఎస్ఐ సునీల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మృతుడి వివరాలు తెలియరాలేదన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని రిమ్స్ మార్చురీకి తరలించామన్నారు. మృతదేహానికి సంబంధించి వివరాలు తెలిస్తే 94406 27658, 94409 00811 నెంబరులో తెలియజేయాలన్నారు.

చోరీ కేసులో వ్యక్తి అరెస్టు

రైళ్లలో చోరీకి పాల్పడుతున్న జయరాజు అనే వ్యక్తిని అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు రైల్వే ఎస్ఐ సునీల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. నంద్యాల జిల్లా కోయిలకుంట్ల తాలూకా నొస్సం గ్రామానికి చెందిన జయరాజు రైలు ప్రయాణికుల వద్ద నుంచి ఒక సెల్‌ఫోన్, ల్యాప్‌టాప్ దొంగిలించాడన్నారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు దొంగను అరెస్టు చేసి గుంతకల్లులోని రైల్వే కోర్టులో హాజరు పరచగా, జడ్జి రిమాండ్ విధించడంతో కడప కేంద్ర కారాగారానికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

వల్లూరు(చెన్నూరు) : చెన్నూరు మండల పరిధిలోని పాలెంపల్లె వద్ద శనివారం 18 బస్తాల అక్రమ రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు చెన్నూరు సీఐ క్రిష్ణారెడ్డి పోలీసు సిబ్బందితో కలిసి పాలెంపల్లె వద్ద వున్న చంద్రశేఖర్‌రెడ్డి అనే వ్యక్తికి చెందిన గోడౌన్‌లో తనిఖీలు నిర్వహించారు. ఇందులో అక్రమంగా నిలువ వుంచిన 18 బస్తాల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మహిళ అదృశ్యం


అనూష (ఫైల్)

కలసపాడు : మండలంలోని చింతలపల్లె గ్రామానికి చెందిన గాలి అనూష గత నెల 15వ తేదీ నుండి కనిపించడం లేదని ఆమె తండ్రి గాలిప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ విజయకుమార్ తెలిపారు. గత నెల 15వ తేదీ అనూష ఇంటి నుండి వెళ్లి కనిపించలేదని శనివారం ఆమె తండ్రి ప్రసాద్ ఫిర్యాదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు. మహిళ ఆచూకీ తెలిస్తే 9121100632 నెంబరుకు సమాచారం అందించాలని కోరారు.

దుకాణానికి నిప్పు పెట్టినవారిపై కేసు

ఒంటిమిట్ట : ఇచ్చిన అప్పును అడిగినందుకు చిల్లర దుకాణంపై పెట్రోల్ పోసి కాల్చిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఒంటిమిట్ట సీఐ బాబు శనివారం తెలిపారు. సీఐ తెలిపిన వివరాల మేరకు...కల్యాణ్ రామ్ టౌన్ షిప్ వద్ద పెద్దకొత్తపల్లికి చెందిన పట్నం పెంచలయ్య చిల్లర దుకాణం నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడన్నారు. ఆ దుకాణంలో కొంత కాలం క్రితం కట్టా మల్లికార్జున అనే వ్యక్తి చిల్లర బాకీ ఉన్నాడన్నారు. ఆ బాకీని చెల్లించమని అడిగినందుకు మల్లికార్జున మరో వ్యక్తితో కలిసి దుకాణంపై పెట్రోల్ పోసి నిప్పంటించాడన్నారు.

ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్‌లో వైవీయూకు ఉన్నత స్థానం

వైవీయూ వైస్ చాన్సలర్ ఆచార్య అల్లం శ్రీనివాసరావు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైవీయూ వీసీ అల్లం శ్రీనివాసరావు

కడప ఎడ్యుకేషన్ : బోధన, పరిశోధన, సేవ అనే దృక్పథంతో ఏర్పాటైన యోగి వేమన విశ్వవిద్యాలయం అనతి కాలంలోనే అత్యున్నత ప్రమాణాలతో పరిశోధనలతో ప్రముఖ విశ్వవిద్యాలయంగా కీర్తిని అందుకుంది. తాజాగా కేంద్ర ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ విడుదల చేసిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ర్యాంకింగ్ ఫ్రేమ్ వర్క్ (ఎన్ఐఆర్ఎఫ్)-2025లో యోగి వేమన విశ్వవిద్యాలయానికి 51 నుంచి 100 లోపు ర్యాంకు లభించిందని విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య అల్లం శ్రీనివాసరావు వెల్లడించారు. శనివారం విశ్వవిద్యాలయంలోని తన ఛాంబర్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ దేశంలో స్టేట్ పబ్లిక్ యూనివర్సిటీస్ 500 పైన ఉండగా అందులో వైవీయూ 51 నుంచి వందలోపు ర్యాంకు దక్కించుకోవడం విశ్వవిద్యాలయ సమష్టి కృషికి నిదర్శనమన్నారు. 2006లో ఏర్పాటైన వైవీయూ పాత విశ్వవిద్యాలయాలైన అనంతపురం జేఎన్టీయూ, ఎస్కేయూ, పద్మావతి విశ్వవిద్యాలయం వంటి వాటి సరసన నిలిచిందన్నారు. వైవీయూలో రామన్ ఫెలోషిప్, డాడ్ ఫెలోషిప్ పొందిన అధ్యాపకులు పనిచేస్తున్నారని అలాగే జర్మనీ, యూకే, యూఎస్ లలో పరిశోధనలు చేస్తున్నారని తెలిపారు. సెంట్రల్ యూనివర్సిటీ పరిధిలో సెవెన్ స్పోక్ యూనివర్సిటీలను ఎంపిక చేయగా వాటిలో ఒకటి శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ రెండవది వైవీయూ కావడం గర్వకారణం అన్నారు. తద్వారా వైవీయూలో పరిశోధనకు రూ. 10 కోట్ల నిధులు రానున్నాయన్నారు. నిర్ణీత సమయంలో భారత ప్రభుత్వానికి ఎప్పటికప్పుడు నివేదికలు పంపిస్తూ మంచి ర్యాంకులు యూనివర్సిటీ సొంతం చేసుకోవడానికి కృషి చేస్తున్న ఐక్యూఏసీ బృందాన్ని వీసీ అభినందించారు.

విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య పి.పద్మ మాట్లాడుతూ విద్యార్థుల సౌకర్యాలు, ప్లేస్‌మెంట్ పైన ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు. ఇంటర్నల్ క్వాలిటీ అసూరెన్స్ సెల్ (ఐక్యూ ఏసీ) సంచాలకులు డాక్టర్ ఎల్.సుబ్రహ్మణ్యం శర్మ, పీఎం ఉషా సమన్వయకర్త డాక్టర్ టి.చంద్రశేఖర్ మాట్లాడుతూ 2027 నాటికి 100 ప్రాజెక్టులతో న్యాక్ ఏ ప్లస్ గ్రేడ్ కోసం పోటీ పడతామని తెలిపారు. ఈ సమావేశంలో ఐక్యూఏసీ అసోసియేట్ డైరెక్టర్ డాక్టర్ సుభాష్ చంద్ర, సభ్యులు డాక్టర్ దాక్షాయని, డాక్టర్ కట్టా వెంకటేశ్వర్లు, ప్రజా సంబంధాల విభాగం సంచాలకులు డాక్టర్ పి. సరిత, డాక్టర్ కె. శ్రీనివాసరావు, డాక్టర్ తుమ్మలూరు .సురేష్ బాబు పాల్గొన్నారు.

'కృషి'కి దక్కిన ఫలితం

- ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రాన్ని వరించిన పురస్కారాలు
- జోనల్ స్థాయిలో మూడు ప్రథమ, ఒకటి తృతీయ స్థానం
- హర్షం వ్యక్తం చేస్తున్న కేవీకే సమన్వయకర్త, శాస్త్రవేత్తలు


ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రం

కడప అగ్రికల్చర్ : తమిళనాడులోని రాయవేలూరు వేదికగా ఈనెల 2వ తేదీ నుంచి 4వ తేదీ వరకు జరిగిన జోనల్ స్థాయి(ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, పుదుచ్చేరి,తెలంగాణ రాష్ట్రాలు) కృషి విజ్ఞాన కేంద్రాల వార్షిక కార్యాచరణ కార్యశాలలో కడప ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రానికి జోనల్ స్థాయిలో నాలుగు పురస్కారాలు లభించాయి. ఇందులో

- షెడ్యూల్డ్ కులాల ఉప ప్రణాళిక పథకాన్ని విజయవంతంగా జిల్లాలో అమలు పరిచినందుకు ప్రథమ స్థానం.
- అపరాలు ఆదర్శ గ్రామం పథకాన్ని విజయవంతంగా నడిపిస్తునందుకు మూడవ స్థానం.
- జిల్లాలో మినుములో పల్లాకు తెగులు తట్టుకునే రకాలను విస్తరించినందుకు ప్రథమ స్థానం.
- అత్యుత్తమ ఫొటో విభాగంలో ప్రథమ స్థానం.

ఈ పురస్కారాలను వ్యవసాయ సాంకేతిక విజ్ఞాన అనుప్రయోగ సంస్థ(అటారీ)జోన్ -10 డైరెక్టర్ డాక్టర్ షేక్ ఎన్. మీరా, ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం విస్తరణ సంచాలకులు డాక్టర్, జి. శివనారాయణ సమక్షంలో అందించారు. ఈ సందర్భంగా ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ అంకయ్య మాట్లాడుతూ ఈ పురస్కారాలు రావడానికి కృషి చేసిన, తోడ్పాటు అందించిన ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ ఆర్. శారద జయలక్ష్మికి, విస్తరణ సంచాలకులు డా. జి శివనారాయణ, సహాయ వ్యవసాయ పరిశోధన సంచాలకులు డా. సుమతి, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం తిరుపతి వారికి ధన్యవాదాలు తెలిపారు. అలాగే ఈ పురస్కారాలు సాధించడానికి విశేష కృషి చేసిన పూర్వపు కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ వీరయ్య, కేవీకే శాస్త్రవేత్తలు, సాంకేతిక, కార్యక్రమ సిబ్బందికి సహకరించిన వైఎస్సార్ కడప, అన్నమయ్య జిల్లాల రైతులకు, వ్యవసాయ, అనుబంధ విభాగాల అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. కేవీకే శాస్త్రవేత్తలు హర్షం వ్యక్తం చేశారు.

ఉత్సాహంగా రాష్ట్రస్థాయి సూపర్ సెవెన్ క్రికెట్ పోటీలు


క్రికెట్ ఆడుతున్న క్రీడాకారులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్‌లో శనివారం ఆంధ్రప్రదేశ్ సూపర్ సెవెన్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి 4వ సూపర్ సెవెన్ అండర్-23 యూత్ క్రికెట్ పోటీలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి 11 టీంలు ఈ పోటీల్లో పాల్గొన్నాయి. పోటీలను ప్రారంభించిన సీమాంధ్ర బీసీ సంక్షేమం సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చల్లా రాజగోపాల్ మాట్లాడుతూ క్రీడాకారులు నిత్యం క్రీడా సాధన చేసి రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో యూత్ క్రికెట్ క్లబ్ అధ్యక్షుడు మార్తల సుధాకర్‌రెడ్డి, పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు నాగార్జునరెడ్డి, రాష్ట్ర సూపర్ సెవెన్ క్రికెట్ అసోసియేషన్ సెక్రటరీ దేవేంద్ర, నంద్యాల జిల్లా సెక్రటరీ కిరణ్, అన్నమయ్య జిల్లా సెక్రటరీ మురళీ, పలు జిల్లాల కార్యదర్శులు, వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

పంటల సాగులో రైతులకు తోడ్పాటునందించాలి

వ్యవసాయ పరిశోధన స్థానం ప్రిన్సిపల్ సైంటిస్టు ప్రభాకర్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త ప్రభాకర్‌రెడ్డి

కడప అగ్రికల్చర్ : పంటల సాగులో రైతులకు కావాల్సిన సూచనలు, సలహాలను అధికారులు అందించి రైతుల అభివృద్ధికి కృషి చేయాలని ఊటుకూరు వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రిన్సిపల్ సైంటిస్టు డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. కడప నగర శివార్లలోని ఊటుకూరు పరిశోధన కేంద్రంలో శనివారం సమావేశం నిర్వహించారు. జిల్లా జేడీఏ, జిల్లా ఏడీఏలు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలో సాగుచేస్తున్న పంటల వృద్ధి దశలు, వాటిలో ఉత్పన్నమవుతున్న సమస్యల గురించి చర్చించారు.

పట్టపగలే రెండిళ్లలో చోరీ

గుర్రంకొండ : మండల కేంద్రమైన గుర్రంకొండలో పట్టపగలే రెండిళ్లలో చోరీ జరిగింది. గుర్తు తెలియని దుండగులు ఇళ్ల తాళాలు పగులగొట్టి లోనికి ప్రవేశించి బీరువాల్లోని విలువైన వస్తువులు ఎత్తుకెళ్లారు. స్థానిక బలిజగడ్డ వీధిలో అపోలో రెడ్డెప్ప, పరసా శ్రీనివాసులు కుటుంబాలు వ్యవసాయం చేసుకొంటూ జీవనం సాగిస్తున్నారు. శనివారం వారు ఇళ్లకు తాళాలు వేసుకొని వ్యవసాయ పనుల నిమిత్తం పొలాల వద్దకు వెళ్లారు. మధ్యాహ్నం ఇంటికి వచ్చి చూడగా అప్పటికే ఇంటి తాళాలు పగులగొట్టి ఉండడం గమనించారు. రెండిళ్లలోని బీరువాలను బద్దలు గొట్టి అందులో వస్తువులు చోరీ చేసినట్లు గుర్తించారు. జనసంచారం తక్కువగా ఉన్న ఈ ప్రాంతంలో దయం 11 గంటల నుంచి 12 గంటల మధ్యలోనే చోరీలు జరిగినట్లు స్థానికులు పేర్కొన్నారు. కాగా అపోలో రెడ్డెప్ప ఇంట్లో విలువైన వస్తువులు ఏమీ లేకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. పరసా శ్రీనివాసులు ఇంట్లో మాత్రం రూ. 60 వేలు నగదు, ఒక ఉంగరం, ఒకచైను, ఒక జత కమ్మలు చోరీకి గురైనట్లు తేలింది. వీటి విలువ సుమారు రూ. 2.50 లక్షలు ఉంటుందని బాధితులు పేర్కొన్నారు. జరిగిన సంఘటనపై స్థానిక పోలీసులకు సమాచారం అందించారు.

బాబు పాలనలో సంక్షోభంలో వ్యవసాయం

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



అన్నదాత పోరు పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వంలో వ్యవసాయం సంక్షోభంలో పడిందని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాదరెడ్డి విమర్శించారు.ఎరువుల బ్లాక్ మార్కెట్‌ను నిరోధించి రైతులందరికి యూరియా సరఫరా చేయాలని కోరుతూ ఈనెల 9న ఉదయం 10 గంటలకు అన్నదాత పోరు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రొద్దుటూరులోని తన స్వగృహంలో శనివారం అన్నదాత పోరు పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ వ్యవసాయాన్ని పండుగ చేసింది దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి అయితే వ్యవసాయాన్ని దండగగా మార్చిన ఘనత చంద్రబాబుదేనన్నారు. చంద్రబాబుకు తొలి నుంచి రైతులపై ప్రేమ లేని కారణంగా వ్యవసాయాన్ని నిర్వీర్యం చేశారన్నారు. యూరియా కోసం వెళ్లిన రైతులపై గతంలో లాఠీ చార్జి చేసిన పరిస్థితులు ఉన్నాయన్నారు.

జగన్ ప్రభుత్వంలో కొరత లేదు

వైఎస్ జగన్ ప్రభుత్వంలో ఐదేళ్ల రైతులకు సమస్యలు లేవని రాచమల్లు శివప్రసాదరెడ్డి అన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా ఎరువులు, విత్తనాలను అందించడంతోపాటు శాస్త్రవేత్తల ద్వారా సలహాలు కూడా ఇచ్చేవారన్నారు. ప్రస్తుతం పరిస్థితి అందుకు భిన్నంగా మారిందన్నారు. సరైన ప్రోత్సాహం లేని కారణంగా ఆర్థిక ఇబ్బందులతో రైతులు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి ఏర్పడిందన్నారు. అన్యాయాన్ని ప్రశ్నించిన వారిపై కేసులు పెట్టి జైలులో వేయాలని చంద్రబాబు ప్రభుత్వం అసెంబ్లీలో చట్టం చేస్తోందన్నారు. ఎంత మందిని ఎంత కాలం జైళ్లలో పెడతారని రాచమల్లు ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, ఎంపీపీ శేఖర్ యాదవ్, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు పోరెడ్డి నరసింహారెడ్డి, కౌన్సిలర్లు వరికూటి ఓబుళరెడ్డి, లావణ్య, జయంతి, రాగుల శాంతి, ముదిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి, చింపిరి అనిల్ కుమార్, రైతు నాయకులు టంగుటూరు విశ్వనాథరెడ్డి, శంకరాపురం మల్లికార్జునరెడ్డి, కోఆప్షన్ సభ్యుడు మల్లికార్జున ప్రసాద్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల మండల పరిధిలోని పోట్లదుర్తి గ్రామం వద్ద గత ఏడాది జూన్ 18న జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన చిట్టిపోయిన బాలరాజు ప్రొద్దుటూరు ఆసుపత్రుతి చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడని డెర్రగుంట్ల పోలీసులు తెలిపారు. ప్రొద్దుటూరు మండలం పరిధిలోని కల్లూరు గ్రామానికి చెందిన బాలరాజు మరో ఐదు మందితో కలిసి గత ఏడాది జూన్ 18వ తేదీన ఎర్రగుంట్ల రైల్వే స్టేషన్ నుంచి ఆటోలో స్వగ్రామానికి బయలుదేరాడు. పోట్లదుర్తి గ్రామ వద్దకు రాగానే గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో బాలరాజుకు తీవ్ర గాయాలయ్యాయి. అప్పటి నుంచి అపస్మాకర స్థితిలో ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రితో చికిత్స పొందుతూ ఉన్నాడు. కోలుకోలేక శనివారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

అత్యాచారం కేసులో వ్యక్తి అరెస్టు


అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న పోలీసు అధికారులు

వేముల : మైనర్ బాలిక అత్యాచారం కేసులో కుంచపు వెంకటరమణ అనే వ్యక్తిని అరెస్టు చేసినట్లు సీఐ ఉలసయ్య, ఎస్ఐ ప్రవీణ్‌కుమార్‌లు తెలిపారు. వేముల పోలీస్ స్టేషన్‌లో శనివారం వారు విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. వేముల గ్రామానికి చెందిన కుంచపు వెంకటరమణ 2021లో స్థానికంగా ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుతుండేవాడు. మధ్యలో చదువు ఆపేసి అప్పటి నుండి బేల్దారి పనికి వెళ్లేవాడు. ఈ క్రమంలో గత నాలుగు నెలల నుండి వేముల గ్రామానికి చెందిన మైనర్ బాలికను ప్రేమిస్తున్నానంటూ వెంటపడుతుండేవాడు. ఈ నేపథ్యంలో గతనెల 30వ తేదీ బాలికను బలవంతంగా మోటార్ సైకిల్‌పై ఎక్కించుకుని వెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ సంఘటనకు సంబంధించి బాధిత బాలిక ఫిర్యాదు మేరకు కుంచపు వెంకటరమణపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. నిందితుడిని శుక్రవారం సాయంత్రం అరెస్టు చేశారు. శనివారం కోర్టులో హాజరుపరచగా కోర్టు రిమాండ్ విధించినట్లు వారు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో ఆరోగ్యమాత ఉత్సవాలు


ఆరోగ్యమాత సందేశాన్ని తెలియజేస్తున్న గురువులు

కడప సెవెన్‌రోడ్స్ : కడప నగరంలోని ఆరోగ్యమాత ఉత్సవాల్లో భాగంగా శనివారం 9వ రోజున నవదిన పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నల్గొండ డాన్‌బాస్కో ప్రిన్సిపాల్ తాళ్ల విల్సన్ సందేశాన్ని అందజేశారు. తొలుత అలంకరించిన పల్లకీపై మరియమాత స్వరూపాన్ని ఉంచి చర్చి ప్రాంగణంలో విశ్వాసులు స్తుతి గీతాలు ఆలపిస్తూ ప్రదక్షిణలు నిర్వహించారు. ఈ సందర్భంగా గురువులు ఆరోగ్యమాత సందేశాన్ని వినిపించారు. భక్తులు స్తుతి గీతాలు ఆలపించారు. తేరు, దివ్య బలిపీఠాలను అలంకరించారు. ఈ కార్యక్రమంలో ఫాదర్ ఎండీ ప్రసాద్ రావు, ప్రెసిడెంట్ విక్టర్, కార్యదర్శి సెబాస్టియన్, ఆర్థిక కార్యదర్శి ఆనందరావు, డేవిడ్, ఆంథోని, జార్జి, రాజేంద్ర, మణి, జయరాజుతోపాటు పలువురు విశ్వాసులు పాల్గొన్నారు.

పిల్లల రక్షణ చట్టాల అమలుపై సమీక్ష


మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సి. యామిని

కడప అర్బన్ : రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ డాక్టర్ సి.యామిని, సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ ఎస్. బాబా ఫకృద్దీన్ ఆధ్వర్యంలో శనివారం కడపలోని కోర్టు ప్రాంగణంలో గల న్యాయ సేవా సదన్‌లో ×బాలల న్యాయం, పిల్లల రక్షణ చట్టాల అమలులో సమస్యలు, సవాళ్లు మొదలగు అంశాలపై జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సి. యామిని మాట్లాడుతూ ×బాలల న్యాయం, జేజేబీ చట్టం 2015, పోక్సో చట్టం 2012, పీసీఎంఏ 2006, బాల కార్మిక (నిషేధ మరియు నియంత్రణ) చట్టం 1986, పీసీ మరియు పీఎన్‌డీటీ చట్టం 1994, ఆర్టీఈ 2009, హెచ్ఏఎంఏ చట్టం 1956, ఆంధ్రప్రదేశ్ పంచాయతీ వికాస చట్టం 1977, ఎంటీపీ చట్టం 2021, అంగీకారాలు ఉన్న వ్యక్తుల హక్కుల చట్టం 2016 మొదలగు చట్టాల అమలులో సమస్యలు, సవాళ్లు మొదలు అంశాలపై వివరించారు. శాఖల వారీగా సమస్యలు, సవాళ్లు అంశాలను ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. బాల్య వివాహాలు, గర్భధారణ, పిల్లల ఆరోగ్యం, విద్య, పునరావాసం, ప్రభుత్వ పథకాలు, దూరప్రాంతాల పిల్లల సదుపాయాలు అనే అంశాలను వివరించారు. లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 15100, చైల్డ్ హెల్ప్ లైన్ నెంబర్ 1098, దివ్యాంగ జన్ హెల్ప్ లైన్ నెంబర్ 14456 అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఫస్ట్ అడిషనల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కడప కం జ్యువెనల్స్ బోర్డ్ ప్రిన్సిపల్ మెజిస్ట్రేట్ కె. భార్గవి, జిల్లాలో వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

హెచ్ఐవీపై యువతకు అవగాహన అవసరం

జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ నాగరాజు


5కే రెడ్ రన్ మారథాన్‌ను ప్రారంభిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ నాగరాజు

కడప రూరల్ : హెచ్ఐవీ/ఎయిడ్స్ వ్యాధి పట్ల నేటి యువతకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ నాగరాజు పిలుపునిచ్చారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో యూత్ ఫెస్ట్ 2025-26లో భాగంగా శనివారం 5కే రెడ్ రన్ మారథాన్ నిర్వహించారు. కొత్త కలెక్టరేట్ రోడ్డు నుంచి రిమ్స్ బ్రిడ్జి వరకు కొనసాగిన ఈ మారథాన్ యూ టర్న్ తీసుకుని తిరిగి మహావీర్ సర్కిల్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా డాక్టర్ నాగరాజు మాట్లాడుతూ హెచ్ఐవీ అంటు వ్యాధి కాదని తెలుసుకోవాలన్నారు. హెచ్ఐవీ బాధితుల పట్ల వివక్షను విడనాడాలన్నారు. ఇదే క్రమంలో యువత హెచ్ఐవీ బారిన పడి బంగారు భవిష్యత్తులను చేజేతులా కోల్పోవద్దని సూచించారు. జిల్లా లెప్రసీ, ఎయిడ్స్-టీబీ అధికారి డాక్టర్ యస్.రవి బాబు మాట్లాడుతూ హెచ్ఐవీ /ఎయిడ్స్ బారిన పడిన వ్యక్తుల పట్ల వివక్ష చూపకూడదని వారి పట్ల ప్రేమ, అభిమానాలు కలిగి ఉండాలని తెలియజేశారు. క్లస్టర్ ప్రోగ్రామ్ ఆఫీసర్ భాస్కర్ వేంపల్లె మాట్లాడుతూ హెచ్ఐవీ ఎయిడ్స్ కి చికిత్స ఉందన్నారు. దీనిపై అనుమానాలు ఉంటే ప్రభుత్వ ఆసుపత్రులలో ఉచిత పరీక్షలు చేయించుకోవచ్చని తెలిపారు. అలాగే హెచ్ఐవీ ఉన్న వ్యక్తులు ఎలాంటి భయం, ఆందోళన లేకుండా ప్రభుత్వ ఆసుపత్రులలో ఉచిత మందులు తీసుకోవాలని తెలిపారు . ఈ 5కే రెడ్ రన్ మారథాన్‌లో అబ్బాయిల విభాగంలో మొదటి బహుమతి ఎ. సింహాచలం (గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజ్ ఫర్ మెన్, కడప), రెండవ బహుమతి ఈ. సికిందర్ (గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజ్ ఫర్ మెన్, కడప) గెలుచుకున్నారు. అలాగే యువతుల విభాగంలో మొదటి బహుమతి శ్రీశ (గవర్నమెంట్ పాలిటెక్నిక్ విమెన్ కాలేజీ, కడప), రెండవ బహుమతి కీర్తి (గంగాభవాని కాలేజీ) గెలుపొందారు. ట్రాన్స్ జెండర్స్ విభాగంలో మొదటి బహుమతి పింకి (యస్‌బీఆర్‌టీఎం కాలేజ్, కడప), రెండవ బహుమతి ఇ. మహేష్ (ఎస్వీ డీసీ కాలేజీ, కడప) గెలుపొందారు. జిల్లా క్రీడల అధికారి జగన్నాథ్ రెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏఆర్‌టీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ గురవయ్య, స్టేప్ మేనేజర్ సుబ్బరాయుడు, స్టాటిస్టికల్ ఆఫీసర్ రమేష్‌రెడ్డి, అసిస్టెంట్ మలేరియా అధికారి వెంకటరెడ్డి, కోచ్‌లు అమృత్‌రాజ్, కల్యాణ్, ఇతర అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.